క్లుప్తంగా

ముమ్మరంగా తనిఖీలు



చిన్నశంకరంపేటలో వాహనం తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండల కేంద్రంలోని మెదక్ – చేగుంట ప్రధాన రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేలు దాటిన నగదును సీజ్ చేయనున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వేణుమాదవ్ తెలిపారు. ప్రతీరోజు వాహనాల తనిఖీ ఉంటుందని, రూ.50 నగదు దాటిన వారు సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. మెదక్ నుంచి చేగుంట ప్రధాన రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆకస్మిక తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆలయ కమిటీ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం సభ్యులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని కల్యాణ రామచంద్రస్వామి దేవాలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నక్క సిద్ధరాంలు, రవీందర్, అధ్యక్షుడిగా నవాత్ ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా పటేరి రాము, రాజేంద్రప్రసాద్, మహేశ్, కార్యదర్శులుగా స్వామిగౌడ్, సరిదే వెంకటేశం, ప్రసాద్, నాగరాజును ఎన్నుకున్నారు. కోశాధికారిగా నవీన్, పీఆర్వోగా కిరణ్‌కుమార్, సభ్యులుగా బస్వరాజు, జుంగే సత్యనారాయణ, సాంగని సుధాకర్, ఆంజనేయులు, యాదగిరిగౌడ్, సరిదే రాజును ఎన్నుకున్నారు.

కరాటే పోటీల్లో రాణించిన విద్యార్థులు



సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం మనోహరాబాద్‌లో కుంగుపూ అండ్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో రాణించిన వారికి గ్రేడింగ్ సర్టిఫికెట్స్‌లను మండల నాయకుడు వెంకట్‌గౌడ్ అందజేశారని నిర్వాహక మాస్టర్ సంజీవ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ ప్రవీణ్, శ్రీకాంత్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



తూప్రాన్- నర్సాపూర్ రోడ్డుకు ఆనుకొని తవ్విన గుంత

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్‌నెట్ కనెక్షన్ కోసం తవ్వాకాలు జరిపి వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రం శివ్వంపేటలోని తూప్రాన్ – నర్సాపూర్ ప్రధాన హైవే పక్కన ఇంటర్‌నెట్ కేబుల్ వేసేందుకు గుంత తవ్వి వదిలేశారు. నెలలు గడుస్తున్న పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు వాపోయారు. నిత్యం వాహనాలు, ప్రజలతో రద్దీగా ఉంటే చోట గుంత ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారస్తులు అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ వాడొద్దు



జీడిపల్లిలో ప్లాస్టిక్ వాడొద్దని అవగాహన కల్పిస్తున్న యువత

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జీడిపల్లి గ్రామ యువత ఆదివారం 7వ వారం స్వచ్ఛభారత్ చేపట్టి గ్రామంలోని పలు వీధులను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను, చెత్త చెదారాన్ని తొలగించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ప్లాస్టిక్ వాడొద్దని, వాటిని విక్రయించొద్దని, వాటి వల్ల అనర్థాల గూర్చి గ్రామ వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ పండుగను సంతోషంగా జరుపుకొన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద యువకులు పెద్ద పెద్ద బ్యారెళ్లలో రంగులు నింపుకొని అక్కడికి వచ్చిన వారిపై రంగులు చల్లుతూ పండగ శుభాకాంక్షలు తెలిపారు. కొంత మంది మహిళలు కాముడి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. సాయంత్రం సమయంలో హనుమాన్ చౌరస్తా వద్ద ఆచారం ప్రకారం పిడిగుద్దులు, కోలాటం ఆడారు. హోలీకి ముందురోజు శనివారం అర్ధరాత్రి దాటాక పలు కూడళ్లలో కాముడిని దహనం చేశారు.

రామాయంపేట(మెదక్): పట్టణంలో శనివారం రాత్రి కామ దహనం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో, కేసీఆర్ కాలనీలో కాముడిని దహనం చేశారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో, పారిశ్రామిక వాడల్లో కార్మికులు ఘనంగా జరుపుకొన్నారు. అంతకు ముందు రాత్రికాముడిని దహనం చేశారు.

కొంతన్‌పల్లిలో పిడిగుద్దులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామంలో హోలీ సంబురాలు ప్రత్యేకంగా జరుపుకొంటారు. ఇక్కడ ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న ఆచారాన్ని నేటికి గ్రామస్తులు కొనసాగిస్తున్నారు. హోలీ రోజున సాయత్రం గ్రామంలోని ప్రధాన కూడలి వద్దకు వతందారులందరూ చేరుకొని రెండు గ్రూపులుగా విడిపోయి తాడు కట్టి లాగుతారు. అనంతరం ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుతారు. ఈ ఆటను గ్రామస్తులు ఆనందగా ఆస్వాదిస్తారు. ఇక్కడ జరిగే పిడిగుద్దుల ఆటను చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారు. మండల కేంద్రం శివ్వంపేటలో శనివారం అర్ధరాత్రి కామ దాహనం నిర్వహించారు. హోలీ వేడుకలు ఉత్సహంగా జరుపుకునేందుకు నిర్వాహకులు పలు ఏర్పాట్లు చేశారు.



మనోహరాబాద్(తూప్రాన్): ముప్పిరెడ్డిపల్లిలో హోలీ వేడుకలో గ్రామస్తులు



శివ్వంపేటలో..



రామాయంపేటలో..



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో హోలీ సంబరాల్లో చిన్నారులు



పెద్దశంకరంపేటలో..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో ఆదివారం హోలీ సంబరాలను ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు.అంతకు ముందు రాత్రి గ్రామ చావిడి వద్ద కాముడిని శాస్త్రోక్తంగా దహనం నిర్వహించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో కాముడి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పిడుకలు, కట్టెలు సేకరించి గ్రామ ప్రధాన కూడలి వద్ద సాంప్రదాయంగా కాముడిని దహనం చేశారు.

పెద్దశంకరంపేట(మెదక్): ఆయా గ్రామాల్లో కామదహన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దశంకరంపేటలోని పాత గ్రామపంచాయతీ వద్ద గ్రామపురోహితులు, పెద్దల సమక్షంలో ప్రత్యేక పూజలు చేసి కాముడిని దహనం చేశారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు



ఇంటర్వ్యూ చేస్తున్న ప్రతినిధులు

మనోహరాబాద్(తూప్రాన్): నిరుద్యోగ యువతకు ఉపాధికి ఎంఎల్‌ఆర్‌ఐటీ ఆధ్వర్యంలో మండలంలోని కూచారం గ్రామంలో ఆదివారం జాబ్‌మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి 100 మంది యువతీ, యువకులు జాబ్‌మేళకు హాజరయ్యారని ఎంఎల్‌ఆర్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఉదయ్‌రంజన్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపెక్స్, ఎస్టీజీ, చౌక్ ప్లాట్ ఫాం, మర్రి లక్ష్మారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల వారి ఆధ్వర్యంలో మేళా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంఎల్‌ఆర్‌ఐటీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, చైర్మన్ లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యువత ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చౌక్ ఫౌండర్ అభిషేక్ గుప్తా, అపెక్స్, ఎస్టీజీ ఫౌండర్ మెంబర్, డైరెక్టర్, సుధీర్‌కుమార్, నేచర్ ఐకాన్ యువత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అపూర్వ సమ్మేళనం

నర్సాపూర్: పట్టణంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1984 సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మండలంలోని మహ్మదాబాద్ గ్రామంలోని ఎఫ్‌సీసీ ముంబై ఏరియా జనరల్ మేనేజర్ చత్రు నాయక్‌కు చెందిన ఆగస్త్య ఫామ్స్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకొన్నారు. సుమారు నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో మిత్రులంతా ఆప్యాయంగా పలుకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చత్రునాయక్‌తో పాటు ఆయా రంగాల్లో ఉన్న శ్రీనివాస్‌రెడ్డి, హైదర్, మంగలి రమేశ్, చందన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మొగులయ్య, శ్రీనివాస్‌గౌడ్, జగన్, వెంకటేషం, రుక్మిణి, ఉమారాణి, వేణుకుమార్, రాములు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులు

కబేళా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



ఆలయ అధికారికి వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

పాపన్నపేట(మెదక్): పవిత్ర పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గాదేవి సన్నిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా కబేళా నిర్వహిస్తున్న వ్యక్తిపై చర్య తీసుకోవాలని ఆదివారం నాగ్సాన్‌పల్లి గ్రామస్తులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఏడుపాయల ఆలయ ప్రాంగణంలో జీవ వధ చేస్తూ, ఇష్టా రీతిన డబ్బులు వసూళ్లు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని కబేలా మూసి వేయాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు

క్రీడలు ఆరోగ్యానికి దోహదపడతాయి

నర్సాపూర్ రూరల్: క్రీడలు ఆరోగ్యానికి దోహదపడతాయని మండలంలోని మంతూర్ గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణంజలి వెంకటేష్ అన్నారు. ఆదివారం గ్రామంలోని వాలీబాల్ క్రీడాకారుల కోసం మాజీ సర్పంచ్ వాలీబాల్ కిట్టుతో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయించారు. క్రీడాకారుల గెలుపే లక్ష్యంగా ఆడాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, మహేష్, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.



వాలీబాల్ కిట్ అందిస్తున్న దాత

కొనసాగుతున్న లక్ష్మీనర్సింహస్వామి జాతర



లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర కనుల పండువగా జరుగుతోంది. అందులో భాగంగా ఆదివారం స్వామివారికి అర్చకులు ధనుంజయ్ శర్మ, విద్యాకర్‌చారిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గుట్టపైన ఉన్న స్వామివారికి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకుని వంటావార్పు చేసుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, సిబ్బంది రామకృష్ణ, నర్సింహారెడితో పాటు తదితరులు ఉన్నారు.

కల్లు పారబోత

నిజాంపేట(మెదక్): మండలంలోని కల్వకుంటలో ఆదివారం కొందరు కల్లు సీసాలను పారబోశారు. కల్లు రుచిగా లేదని, రెండు, మూడు రోజులుగా తాము చెప్తున్నా.. దుకాణం నిర్వాహకులు ఎంతమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు కొందరు ఆరోపించారు. ఈమేరకు దుకాణానికి వచ్చిన కల్లు పెట్టెలో కొన్నింటిని పారబోశారు. ఈ విషయమై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

పోచమ్మ ఆలయ పునర్నిర్మాణోత్సవం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంఘవిపేట గ్రామంలో పోచమ్మ ఆలయ పునర్నిర్మాణోత్సవాన్ని ఆదివారం రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

బీజేపీ గెలుపు కోసం పనిచేయండి

చేగుంట(తూప్రాన్): బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు నాయకులు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని కర్నాల్‌పల్లి వద్ద రఘునందన్‌రావు కార్యకర్తలతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు భూపాల్, నాయకులు గోవింద్, సంతోష్‌రెడ్డి, నర్సింలు, గ్రామాల నాయకులు ఉన్నారు.

ఏటీఎం చోరీకి యత్నం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలోని ఏటీఎం చోరీకి గుర్తు తెలియని దుండగులు ప్రయత్నించారు. శనివారం అర్ధరాత్రి ఏటీఎం ధ్వంసం చేసేందుకు ఏటీఎం డోర్‌ను పగులకొట్టి తెరిచి ఏటీఎంలోని నగదును నిల్వ చేసిన బాక్స్‌ను తీయలేకపోయారు. ఈ విషయంపై ఏటీఎం నిర్వాహకుడు సాయన్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నారాయణ తెలిపారు.

ప్రలోభాలకు గురికాకూడదు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఓటరు తన విలువైన ఓటును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా సక్రమంగా వినియోగించుకోవాలని మండల ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓటు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించి, ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఎన్నికలలో ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరు తన ఓటును వినియోగించుకోవాలన్నారు. డబ్బు, బహుమతులు, కులం, మతం, జాతి, ప్రాంతం, భాష, వర్గం వంటి ప్రలోభాలకు గురై ఓటును ఎట్టి పరిస్థితుల్లో దుర్వినియోగం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్యాం, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిలప్‌చెడ్‌లో ఓటు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ ఆనంద్, తదితరులు

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

అల్లాదుర్గం సీఐ రేణుక

రేగోడ్(మెదక్): రంజాన్, హోలీ పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని అల్లాదుర్గం సీఐ రేణుక తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా పండుగలను చేసుకోవాలని సూచించారు. కెమికల్స్ ఉన్న రంగులతో హోలీ ఆడొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజయ్య, ఏఎస్‌ఐ మల్లయ్య, కో ఆప్షన్ సభ్యుడు చోటుమియా, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

పెద్దశంకరంపేట(మెదక్): పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. హోలీ, ఉగాది, రంజాన్, శ్రీ రామనవమి పండుగలను హిందువులు, ముస్లింలు కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ.శంకర్, ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మురళి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఆర్‌ఎస్.సంతోష్, పున్నయ్య, లక్ష్మణ్, భానుగౌడ్, సలీం, ఖాజా పాల్గొన్నారు.



పీస్‌కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రేణుక

బద్దారంలో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్



బద్దారంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బద్దారం గ్రామంలో ఆదివారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ పురవీధులగుండా నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో కేంద్ర బలగాలు, పోలీసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శంకర్, అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం : మైనంపల్లి

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని సర్దన గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని రోడ్డునపడిన కుటుంబానికి అండగా ఉంటామని మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కావబోయిన కిష్టయ్య, సత్తమ్మ, కోడలు లక్ష్మి, ఇద్దరు పిల్లలు నిద్రిస్తున్న సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గమనించి కుటుంబీకులు అప్రమత్తమై బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. రోడ్డున పడిన బాధిత కుటుంబాన్ని మైనంపల్లి పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, అక్బర్, రాజేందర్‌రెడ్డి, సుభాశ్, రాంచందర్ తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజీపేట మజీద్ వద్ద ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మైనంపల్లి హన్మంతరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ అరుణప్రభాకర్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మైనంపల్లి హనుమంతరావు

విగ్రహ ప్రతిష్ఠకు రావాలని ఆహ్వానం

చేగుంట(తూప్రాన్): విగ్రహ ప్రతిష్ఠోత్సవాలకు హాజరుకావాలని మైనంపల్లి హనుమంతరావుకు రుక్మాపూర్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందించినట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి నాలుగు రోజుల పాటు రుక్మాపూర్‌లో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా కార్యక్రమాలకు హాజరు కావాలని పత్రిక అందించినట్లు సహకార సంఘం చైర్మన్ మ్యాకల పరమేశ్ తెలిపారు. మైనంపల్లిని కలిసిన వారిలో సీనియర్ నాయకులు వెంగళరావు, ఆనందం, మోహన్, శివయ్య, భిక్షపతి తదితరులు ఉన్నారు.

టెట్ అర్హత పరీక్ష ఫీజును తగ్గించాలి

చేగుంట(తూప్రాన్): టెట్ అర్హత పరీక్ష ఫీజును తగ్గించాలని విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాయి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన చేగుంటలో మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం టెట్ అర్హత పరీక్ష కోసం ఒక్కో పేపర్‌కు రూ.వేయి కేటాయించడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి ఫీజుల తగ్గింపుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

జాతర చూసొద్దాం రండి

- భక్తుల కొంగు బంగారం తునికి నల్లపోచమ్మ ఆలయం
- ఈనెల 28 నుంచి 31 వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): వందేళ్లకు పైగా చరిత్ర కలిగి భక్తులు కోరిన కోరికలు తీర్చేలా వెలుగొందుతుంది మండలంలోని తునికి గ్రామంలోని నల్లపోచమ్మ ఆలయం. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయానికి వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారు.

ప్రత్యేకంగా బండ్ల ప్రదర్శణ

నల్లపోచమ్మదేవి ఆలయంలో బండ్ల ప్రదర్శణకు ప్రత్యేకత ఉంది. ఎక్కువ దూరం నుంచి వచ్చిన భక్తులు బండ్లను మొదటి వరసలో ఊరేగిస్తారు. దగ్గరి ప్రాంతం వారికి చివరిలో ఉంటాయి. దూరం నుంచి మొక్కలు తీర్చుకునేందుకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం గతంలో నుంచి పాటిస్తున్న సాంప్రదాయాన్ని నేడు పాటిస్తున్నారు. గతంలో వందకు పైగా బండ్లను ఊరేగించేవారు.



ఆలయంలో కొలువుదీరిన నల్లపోచమ్మ

ఉత్సవాల వివరాలు

తునికి నల్లపోచమ్మ ఉత్సవాలు ఈనెల 28 నుంచి జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 28న ధ్వజారోహణం, 29న అగ్నిగుండాలు, బోనాలు, 30న బండ్ల ఊరేగింపు, 31న పాచిబండ్ల ప్రదర్శన నిర్వహించనున్నారు. జాతరకు ఏర్పాట్లు సైతం ముమ్మరం చేశారు.

> **భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు**
>
> 
>
> ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. నీటి వసతి కోసం రెండు ట్యాంక్‌లు ఉండగా అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తాం. టాయిలెట్స్, మరుగుదొడ్లు ఉన్నాయి.
>
> – మోహన్‌రెడ్డి ఈఓ